సాక్షి మంచిర్యాల

గురువారం । 30 । మే । 2024



ఆర్టీసీ ప్రాంగణంలో ఫంక్షన్ హాల్

బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీ స్థలాన్ని అద్దెకు ఇచ్చేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేస్తే ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. 8లో▸



వరుస చోరీల దొంగ అరెస్టు

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. రూ.10.97లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.0 /32.0

ఉదయం వేళ ఆకాశం ప్రకాశవంతంగా, రాత్రి వేళ మేఘావృతమై ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

కోర్టు ఏర్పాటుకు పరిశీలన



పరిశీలిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో కోర్టు ఏర్పాటుకు సీఐఎస్ఎఫ్ బ్యారక్‌ను జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. పట్టణంలో కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వేంకటేశ్వరస్వామి దేవాలయ సమీపంలోని సింగరేణికి సంబంధించిన సీఐఎస్ఎఫ్ బ్యారక్ సముదాయాన్ని సింగరేణి అధికారులతో కలిసి సందర్శించారు. అన్ని సౌకర్యాలు ఉండడంతో కోర్టుకు అనువుగా ఉంటుందని సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, గతంలో కోర్టు మంజూరు కాగా సింగరేణి యాజమాన్యం బ్యారక్ కేటాయించడంతో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బ్యారక్‌ను ఫంక్షన్ హాల్ చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి స్కూల్‌లో పలు గదులను కోర్టుకు అప్పగించాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. సింగరేణి హైస్కూల్ ఆవరణలో కోర్టుకు వీలు కాదని తెలియజేయడంతో యూనియన్ నాయకులు అంగీకరించారు. దీంతో సీఐఎస్ఎఫ్ బ్యారక్ ఆవరణలో కోర్టు ఏర్పాటుకు మార్గం సులువైంది. ఏవో రవీందర్ సూపరింటెండెంట్ మంజుల, సింగరేణి ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం



పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం అన్నారు. బుధవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను విద్యాసంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేసి పాఠశాలలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రతీ పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, విద్యుద్దీకరణ పనులతోపాటు తరగతి గదులు సిద్ధంగా ఉంచాలని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసే విధంగా ప్రత్యేక అధికారుల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి యాదయ్య పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ షురూ



ఎంఈవోకు పుస్తకాలు అందజేస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడిలో చదివే విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్య, నోట్‌పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. బుధవారం జిల్లా బుక్ డిపో నుంచి మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్ మండలాలకు చెందిన పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని డీఈవో యాదయ్య ప్రారంభించారు. ఈ నెల 30న మందమర్రి, బెల్లంపల్లి, 31న కోటపల్లి, జూన్ 1న చెన్నూర్, జైపూర్, భీమారం, 3న భీమిని, కన్నెపల్లి, నెన్నెల, 4న లక్సెట్టిపేట, దండేపల్లి, 5న తాండూర్, కాసిపేట, 6న జన్నారం మండల కేంద్రాలకు పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ఎంఈవో పోచయ్య, సెక్టోరల్ అధికారి చౌదరి, బుక్‌డిపో మేనేజర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

చెరువులు కబ్జా!



ఇది బెల్లంపల్లి మండలం కన్నాల శివారులోని ఎర్ర చెరువు. రెండేళ్ల క్రితమే ఇక్కడ కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో అధికారులు స్వాధీనం చేసుకోలేదు.



ఇది జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్ చెరువు మత్తడి ప్రాంతం. కట్టపై భాగంతోపాటు మత్తడి వైపు దాకా ప్లాట్లు చేసి హద్దులు వేశారు. బఫర్ ప్రాంతాన్ని కూడా వదలకుండా నివాస ప్రాంతాలుగా మార్చేశారు. ఇక చెరువు శిఖంతోపాటు చెరువు పై భాగంలోనూ ఆక్రమణలు జరిగాయి. ప్రైవేటు పట్టాలోని సర్వే నంబరు చూపిస్తూ ఇప్పటికే కొందరు హద్దులు వేసి ప్లాట్లు అమ్ముకున్నారు. వరదలు వస్తే ఇబ్బందిగా మారే అవకాశం ఉన్నా చెరువు హద్దు దాటుతున్నారు.

జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కబ్జాల పాలైంది. కట్ట ప్రాంతంతోపాటు దిగువన, హైటెక్ సిటీ వైపు చెరువు విస్తీర్ణం తగ్గిపోయింది. రియల్ వ్యాపారానికి అనుగుణంగా మత్తడికి గండి కొట్టి మరీ నీటిని పంపే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత పూడిక తీత, చెరువు పరిరక్షణ కోసం ఫిర్యాదులు చేసినా చెరువు వాస్తవ విస్తీర్ణం లేకుండా పోయింది.



జిల్లా కేంద్రంలోని పోచమ్మ చెరువు మత్తడి కట్ట

- ఆక్రమణల చెరలో సాగునీటి వనరులు
- పట్టణాలు, గ్రామ శివారు ప్రాంతాల్లో అధికం
- స్వాధీనం చేసుకోలేకపోతున్న సాగునీటి శాఖ



వేమనపల్లి మండల కేంద్రంలోని వెంకటమ్మ చెరువులో ఆక్రమణలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సాగు, తాగునీటి అవసరాలు తీర్చే చెరువులు కబ్జాల పాలవుతున్నాయి. ఏటా వేసవిలో చాలా చోట్ల ఆక్రమణలకు గురవుతున్నాయి. పట్టణాలు, గ్రామ శివార్లలో ఉన్న చెరువుల విస్తీర్ణం కుచించుకుపోతోంది. ఇప్పటికే సాగునీటి శాఖ అధికారులు పలు చోట్ల ఆక్రమణలను గుర్తించారు. అయినా కబ్జాల పరంపర కొనసాగుతూనే ఉంది. జిల్లాలోని 18 మండలాల పరిధిలో మొత్తం 890 చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో 63,493 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువుల విస్తీర్ణం తగ్గిపోవడం, కట్టలు, తూములు, కాలువలు సరిగా లేక ఆయకట్టు పూర్తి స్థాయిలో సాగు కావడం లేదు. వానాకాలంలో సుమారు 47వేల ఎకరాల వరకే నీరందుతోంది. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో పలు చోట్ల చెరువులు ఆక్రమణలకు గురవుతున్నట్లు అధికారుల దృష్టికి వస్తున్నాయి.

ఆక్రమణల పరంపర

ఏటేటా వాగులు, చెరువులు, నీటి పరీవాహక ప్రాంతాల విస్తీర్ణం తగ్గుతూ వస్తున్నాయి. మందమర్రి మండలం అందుగులపేట శివారు నుంచి, మంచిర్యాల పట్టణం మీదుగా గోదావరిలో కలిసే వరకు ప్రవహించే పాలవాగు, రాళ్లవాగు కబ్జాల పాలైంది. వాగుకు ఇరువైపులా ఆక్రమణలు జరిగాయి. తిమ్మాపూర్ శివారులో వాగు హద్దుల వరకు ప్లాట్లు వేయగా, ఇటీవల కొన్నింటిని తొలగించారు. సాయికుంట, పోచమ్మకుంట, నస్పూర్, మంచిర్యాల పట్టణాల మధ్యనున్న తోళ్లవాగు కబ్జాకు గురికాగా, అధికారులు కొన్నింటిని తొలగించారు. నస్పూర్ ఊర చెరువు సైతం కబ్జాకు గురైంది. అప్పట్లో ఇక్కడ ఓ వెంచర్ వెలిసింది. తర్వాత కోర్టు తగాదాలు ఉన్నాయి. వీటిలో కొన్నింటి రిజిస్ట్రేషన్లు అయ్యాయి. బెల్లంపల్లి మండలం కన్నాల శివారు ఎర్రవాగు, భీమారం మండల కేంద్రంలోని చెరువు కబ్జాకు గురైనట్లు గుర్తించారు. వీటితోపాటు వేమనపల్లి మండల కేంద్రంలోని వెంకటమ్మ చెరువు ఆక్రమణలకు గురవుతోంది. లక్సెట్టిపేట పట్టణ శివారు ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న కుట్ల చెరువు వరకు మట్టి పోస్తూ ప్లాట్లు చేస్తున్నారు.

పరిరక్షించుకుంటేనే మేలు

భూగర్భ జలాల పెంపుదల, సాగు, తాగునీటి అవసరాలు, జీవవైవిధ్యం కాపాడడంలో చెరువులు కీలకంగా ఉంటాయి. అంతేకాక మత్స్యకారులకు జీవన ఆధారమిచ్చే చెరువులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. పట్టణ ప్రాంతాలు, గ్రామాల శివార్లలో ఉన్న చోట్ల నిర్మాణాలు వెలియడంతో ఇబ్బందికరంగా మారుతోంది. కొన్ని చోట్ల తప్పుడు ధ్రువపత్రాలు తెచ్చి మరీ ఆక్రమిస్తున్నారు. కోర్టు వివాదాలతోనూ చెరువులపై కబ్జాకు గురవుతున్నాయి. సాగునీటి అధికారులు ప్రతీ చెరువును వాస్తవ విస్తీర్ణం మేరకు హద్దులు వేసి కబ్జాలు తొలగించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు



ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్, సీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ శివారులోని ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రం పరిసరాలతోపాటు స్ట్రాంగ్ రూముల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ అన్నారు. బుధవారం ముల్కల్ల లెక్కింపు కేంద్రాన్ని రామగుండం సీపీ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పోలింగ్ కేంద్రం నిరంతరం పర్యవేక్షణలో ఉంటుందని అన్నారు. ఓట్ల లెక్కింపులో కూడా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. లెక్కింపు కేంద్రం పరిసరాలు, స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, కంట్రోల్ రూంలో సీసీ కెమెరాల తీరును పర్యవేక్షించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోతీలాల్, డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాశ్, బెల్లంపల్లి ఏఆర్‌ఓ, అదనపు కలెక్టర్ రాహుల్, ఎస్డీసీ, చెన్నూర్ ఏఆర్‌ఓ చంద్రకళ, ఆర్డీఓ, మంచిర్యాల ఏఆర్‌ఓ రాములు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపాల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

లక్సెట్టిపేట: పశువులకు సోకే సీజనల్ వ్యాధులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశువైద్యాధికారి రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని సూరారం గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పశువులపై నిత్యం జాగ్రత్త వహించాలని, వర్షకాలం సమీపిస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని అన్నారు. అనంతరం 183 ఎద్దులకు టీకాలు వేశారు. సిబ్బంది తిరుపతమ్మ, అనిల్, అభిలాష్ పాల్గొన్నారు.

అడవిలో గడ్డి మైదానాలు



గడ్డి విత్తనాలు సేకరిస్తున్న అటవీశాఖ సిబ్బంది

- పెంపకంపై అటవీశాఖ ప్రత్యేక దృష్టి
- పలు రకాల విత్తనాలు సేకరణ, కవర్లలో భద్రం
- 225 హెక్టార్ల కోసం ప్రతిపాదనలు



గడ్డి విత్తనాల ప్యాకెట్లు

జన్నారం: పులికి సరిపడా వన్యప్రాణుల సంఖ్య పెంచేందుకు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వన్యప్రాణులకు ఇష్టమైన గడ్డిని పెంచి వాటి సంతతి పెంచే క్రమంలో గడ్డి మైదానాలను విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. గత నాలుగేళ్ల క్రితం గడ్డి క్షేత్రాల నిపుణుడు మురద్కర్ జన్నారం అటవీ డివిజన్‌లో అధికారులకు శిక్షణ ఇచ్చారు. అప్పటి నుంచి ఏటా గడ్డి పెంచుతూ వన్యప్రాణులకు ఆహారం అందేలా చూస్తున్నారు. ప్రతీ సంవత్సరం వన్యప్రాణుల కోసం చేపట్టే గడ్డి మైదానాలకు ఇతర ప్రాంతాల నుంచి విత్తనాలను తీసుకొచ్చే పద్ధతిలో కాకుండా.. విత్తనాలు సేకరించి తిరిగి గడ్డి పెంపకం చేపట్టేందుకు అధికారులు గడ్డి విత్తనాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో గత సంవత్సరం పెంచిన గడ్డి నుంచి వరి పంట మాదిరిగా కోయించి అందులో నుంచి విత్తనాలు సేకరిస్తున్నారు. జూన్‌లో వర్షాలు పడగానే గడ్డి విత్తనాలను వేసి డివిజన్‌లో విరివిగా గడ్డి మైదానాల తయారీకి అటవీశాఖ సిద్ధమవుతోంది. కవ్వాల్ టైగర్‌జోన్ వ్యాప్తంగా గడ్డి మైదానాల తయారీకి అధికారులు ప్రణాళిక తయారు చేశారు.

950కిలోల విత్తనాలు సేకరణ

జన్నారం అటవీ డివిజన్‌లో గత రెండేళ్లలో 450 హెక్టార్ల(1,125 ఎకరాలు)లో గడ్డి మైదానాలు పెంచారు. మరో 400 ఎకరాల్లో కలుపు మొక్కలు తొలగించిన ప్రాంతంలో గడ్డి పెంపకం చేపట్టారు. ఇక్కడ మొలచిన గడ్డి నుంచే విత్తనాలు సేకరించి తిరిగి వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జన్నారం అటవీ డివిజన్‌లో ఇదివరకే గడ్డి కోసి 950 కిలోల విత్తనాలు సేకరించి భద్రపర్చారు.

విత్తనాలు ఎలా తీస్తారు

సహజంగా వర్షకాలంలో మొలిచిన గడ్డి విత్తనాలతోపాటు ప్రత్యేకంగా వేసిన గడ్డి మైదానాల నుంచి వరి కోసే విధంగా గడ్డిని కోసి ఓ ప్రాంతంలో ఉంచి వాటి నుంచి విత్తనాలు తీస్తారు. డివిజన్‌లోని జన్నారం, ఇందన్‌పల్లి, తాళ్లపేట్ అటవీ రేంజ్‌లలోని పలు బీట్‌లను గుర్తించి అక్కడ గడ్డి మైదానాల్లో మేలురకమైన గడ్డిని కోస్తున్నారు. హైసోలిమా, క్లోరిస్ బార్ బాట, డిజిటేరియాలతోపాటు మరో ఆరు రకాల గడ్డి విత్తనాలకు సంబంధించిన గడ్డిని కోసి కుప్పలుగా వేసి ఆరిన తర్వాత విత్తనాలు రాలుస్తారు. విత్తనాలను కవర్లలో నింపుతారు. వర్షకాలం రాగానే ఎంచుకున్న ప్రాంతంలో వెదజల్లుతారు.

డివిజన్‌లో 225హెక్టర్లలో..

జన్నారం డివిజన్‌లో వచ్చే వర్షకాలం 225 హెక్టార్ల (565 ఎకరాలు)లో గడ్డి మైదానాలు పెంచేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. 2024-25 సంవత్సరానికి గాను ఎఫరెస్టేషన్ స్కీం కింద 75 హెక్టార్లు, కాంపా స్కీం కింద 150 హెక్టార్లలో గడ్డి మైదానాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. గత సంవత్సరం కాంపా స్కీం కింద మాత్రమే గడ్డి క్షేత్రాలు ఏర్పాటు చేయగా ఈ ఏడాది ఎఫరెస్టేషన్ స్కీం కింద నిధులు సమకూర్చేలా అధికారులు ప్రతిపాదనలు పంపారు. జూన్ రెండో వారంలో వర్షాలు పడిన ఆధారంగా గడ్డి విత్తనాలు వేస్తారు.

నీరున్న చోట ప్రాధాన్యత

అడవిలో పెరిగే వన్యప్రాణులకు ఆవాసం, ఆహారం, నీరు ఒకే చోట ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో నీటి సౌకర్యం, ఆవాసం ఉన్న చోట్లలో గడ్డిని పెంచేందుకు ప్రాంతాలు ఎంచుకుంటారు. నీటికుంటలు, చెరువుల ప్రాంతాలు, కుంటల గట్లపైన గడ్డి పెంచుతారు. దీంతోపాటుగా మైదాన ప్రాంతాల్లో కూడా గడ్డి పెంచుతారు. వన్యప్రాణులకు అలజడి లేని ప్రాంతాల్లోనే గడ్డి క్షేత్రాలను విరివిగా పెంచేలా చూస్తున్నారు.

గడ్డి క్షేత్రాలతో వన్యప్రాణుల వృద్ధి



గడ్డి క్షేత్రాలు ఎక్కువగా పెంచడం ద్వారా వన్యప్రాణుల సంతతి కూడా పెరిగే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. వచ్చే సీజన్‌లో మరో 225 హెక్టార్లలో గడ్డి క్షేత్రాలను పెంచే యోచనలో ఉన్నాం. ఇందుకు ప్రతిపాదనలు పంపాం. వర్షాలు పడగానే గడ్డి విత్తనాలు వెదజల్లి విరివిగా గడ్డి పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

రైస్‌మిల్లులపై కొరడా!

- 'సీఎంఆర్' జాప్యంపై క్రిమినల్ కేసులు



ఇందారంలోని రైస్‌మిల్లులో డీఎం, అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్) ఇవ్వకుండా ఏళ్ల తరబడి జాప్యం చేస్తున్న మిల్లులపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ప్రతీ సీజన్‌లో ధాన్యం తీసుకోవడమే గానీ తిరిగి సకాలంలో బియ్యం ఇవ్వడంలో చాలామంది మిల్లర్లు మొండికేస్తున్నారు. జిల్లాలో గత 2022-23 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం ఇచ్చిన మిల్లుల్లో బియ్యం బకాయి ఉన్నవాటిని ఇప్పటికే బ్లాక్ లిస్టులో పెట్టారు. జిల్లాలో 21మిల్లుల వరకు ఇప్పటికీ బియ్యం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాయి. గత కలెక్టర్ భారతీ హోళ్లికేరి వాటిని బ్లాక్ లిస్టులో పెట్టగా అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లతో మినహాయింపులు తెచ్చుకున్నారు. వీటిలో నాలుగు మిల్లులు పూర్తిగా ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాయి. కొన్నింటిలో ధాన్యం సైతం కనిపించడం లేదు. దీంతో వాటిపై క్రిమినల్ కేసులు నమోదుకు సిద్ధమయ్యారు. ఈ నెల 28న జైపూర్ మండలం ఇందారంలోని శివసాయి మిల్లుకు పౌరసఫరాల శాఖ అధికారులు పోలీసు సిబ్బందితో వెళ్లి క్రిమినల్ కేసు నమోదు చేయించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోనున్నారు. బియ్యం విలువ, జరిమానాతోపాటు విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని జిల్లా అధికారులు చెబుతున్నారు.

రైస్‌మిల్లుపై కేసు.. సీజ్

జైపూర్: మండలంలోని ఇందారం శివసాయి రైస్‌మిల్లు యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదుతోపాటు రైస్‌మిల్లు సీజ్ చేసినట్లు పౌరసఫరాశాఖ అధికారులు తెలిపారు. సీఎంఆర్ బియ్యం సకాలంలో ప్రభుత్వానికి అందజేయకుండా మోసానికి పాల్పడిన రైస్‌మిల్లు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై శ్రీధర్ తెలిపారు. శివసాయి రైస్‌మిల్లు(మల్లికార్జున ట్రేడర్స్) యాజమాని గుంత రవికుమార్ ప్రభుత్వానికి అందజేయాల్సిన 2022-23, 24 సంవత్సరాలకు సంబంధించిన రూ.1.29కోట్ల విలువైన సీఎంఆర్ పక్కదారి పట్టించినట్లు ఇటీవల రైస్‌మిల్లులో అధికారులు చేపట్టిన తనిఖీల్లో వెల్లడైనట్లు తెలిపారు. అధికారుల ఫిర్యాదు మేరకు మిల్లు నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చివరి గింజ వరకు కొనుగోలు

- గోదాములు కేటాయించని కేంద్రం
- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్/భీమారం: రైతుల వద్ద ఉన్న ప్రతీ గింజ వరకు కొనుగోలు చేయడమే కాకుండా మద్దతు ధర చెల్లిస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. బుధవారం ఆయన చెన్నూర్ మండలం అస్నాద గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. చెన్నూర్ ప్రెస్‌క్లబ్, భీమారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 119 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2,666 మంది రైతుల వద్ద 17,195 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించామని తెలిపారు. ధాన్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అదనపు గోదాంలు కేటాయించలేదని, గోదా ముల సంఖ్య తగ్గించడంతో మిల్లర్ల వద్ద ధాన్యాన్ని నిల్వ చేసే స్థలం లేక, లారీలు అన్‌లోడ్ కాకుండా కొంత ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారే తప్ప ఎక్కడా సమస్యలు లేవన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చల్లా రాంరెడ్డి, మాజీ సర్పంచ్ గొడిసెల బాపురెడ్డి, హిమవంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పోటు రాంరెడ్డి, సూర్యనారాయణ, చింతల శ్రీనివాస్, పెద్దింటి శ్రీనివాస్,పాడేటి రవి, బుక్యా లక్ష్మణ్, భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భూదందాలు సహించేది లేదు

భీమారం: మండలంలో కాంగ్రెస్ పార్టీ పేరుతో భూదందాలకు పాల్పడితే సహించేది లేదని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మండల నాయకులను హెచ్చరించారు. చెన్నూరుకు వెళ్తున్న ఆయనకు భీమారం మండలం పోలంపల్లి సమీపంలోని మాంతమ్మ దేవాలయం వద్ద నాయకులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో చెడ్డపేరు తెచ్చే విధంగా కాంగ్రెస్ నాయకులు ప్రవర్తించరాదని అన్నారు.

నకిలీ విత్తనాల సరఫరా అరికట్టాలి

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్, పక్కన సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలఅగ్రికల్చర్: నకిలీ విత్తనాల తయారీ, రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్ కలెక్టరేట్‌లో రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాసులు, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ అశోక్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బోల్‌గార్డ్-3 రకాన్ని నిషేధించారని, వినియోగం చట్టరీత్యా నేరమని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలు నియంత్రించేందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ టాస్క్‌ఫోర్స్ బృందాలు నకిలీ, నిషేధిత విత్తనాల నిల్వ, పంపిణీ కేంద్రాలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. గత నాలుగు నెలల కాలంలో నాలుగు కేసులు, 2016 నుంచి ఇప్పటి వరకు 116 కేసులు నమోదు చేశామని తెలిపారు.

మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

మంచిర్యాలఅగ్రికల్చర్: మాదక ద్రవ్య రహిత సమాజమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో సీపీ శ్రీనివాసులు, మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, అబ్కారీ మద్యనిషేధ శాఖ అధికారి నందగోపాల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన, మానసిక వైద్య నిపుణులు సునీల్‌లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, వినియోగం పూర్తి స్థాయిలో నిరోధించేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని తెలిపారు. సీపీ మాట్లాడుతూ 22 కేసులు నమోదు చేశామని తెలిపారు.

పకడ్బందీగా లెక్కింపు ప్రక్రియ

మంచిర్యాలఅగ్రికల్చర్: జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రకళతో కలిసి కౌటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది ఆ రోజు ఉదయం 7.30గంటల వరకు హాజరు కావాలని, 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. జూన్ 3న రెండో విడత శిక్షణ కార్యక్రమం ఉంటుందని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాటించాలని తెలిపారు.

జాతీయస్థాయి క్రీడల్లో కానిస్టేబుల్ ప్రతిభ



సమ్మయ్యను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

బెల్లంపల్లి: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో బెల్లంపల్లికి చెందిన కమిషరేట్ ఆర్మ్‌డ్ రిజర్వుడ్(సీఏఆర్) హెడ్ కానిస్టేబుల్ పూదరి సమ్మయ్య ప్రతిభ కనబర్చాడు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 22 నుంచి 24వరకు పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ మాస్టర్స్ గేమ్స్ మొదటి ఫెడరేషన్ కప్ పోటీలు నిర్వహించారు. సమ్మయ్య 50 ఏళ్ల విభాగంలో షార్ట్‌పుట్ త్రోబాల్ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాడు. సమ్మయ్యను బుధవారం సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్)సి.రాజు, సీఏఆర్ ఏసీపీ సురేందర్, రామగుండం ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఎంటీఓ ఆర్ఐ సంపత్, ఆర్ఐ(అడ్మిన్) వామనమూర్తి, ఆర్ఎస్సైలు శివ, సరిత, ప్రవీణ్, శ్రీహరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో హమాలీ కార్మికుడు మృతి


మృతుడు తోట తిరుపతి(ఫైల్)

నెన్నెల/భీమిని: నెన్నె ల మండల కేంద్రానికి చెందిన హమాలీ కార్మికుడు తోట తిరుపతి(36) బుధవారం వడదెబ్బతో మృతిచెందాడు. తోటి హమాలీలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం కన్నెపల్లి మండలం ఖాజీపల్లి గ్రామంలో వడ్లు తూకం వేసి లోడ్ చేసేందుకు తోటి హమాలీలతో కలిసి వెళ్లాడు. ధాన్యం బస్తాలను డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితికి చేరాడు. నీళ్లు తాగించి ఆ స్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందా డు. కన్నెపల్లి పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శ్రీలత, కుమారులు శ్రేయాన్(7), హర్షవర్ధన్(4) ఉన్నారు.

వడదెబ్బతో గిరిజన యువకుడు మృతి


మృతుడు భీమ్‌రావు

తాండూర్: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు టోకెమ్ భీమ్ రావు(26) బుధవారం వడదెబ్బ తగిలి మృతిచెందాడు. మాదారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్‌రావు తన స్నేహితులతో కలిసి సోమవారం సోనాపూర్ గ్రామంలో జరిగిన పెళ్లికి ఎండలో నడుచుకుంటూ వెళ్లాడు. పెళ్లి తంతు ముగిశాక మంగళవారం రాత్రి ఇంటికి చేరిన కొద్ది సేపటికే వాంతులు చేసుకున్నాడు. బుధవారం భీమ్‌రావును కుటుంబీకులు బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. భీమ్‌రావు తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతిచెందగా పెదనాన్న టోకెమ్ దోబీ వద్ద ఉంటున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి


మృతుడు పుప్పాల మహేష్(ఫైల్)

నెన్నెల: మండల కేంద్రంలోని సుంకరివా డకు చెందిన పుప్పాల మహేష్(32) బుధవారం విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ తన భార్య స్వప్నతో కలిసి పరిగే మామిడికాయలు కోసేందుకు జంగాల్‌పేటకు వెళ్లాడు. జంగాల్‌పేట కొత్తగూడంలో మామిడి చెట్టెక్కి కాయలు కోస్తుండగా చెట్టుపై నుంచి వెళ్లే విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి కూతురు హని(12), కుమారుడు చరణ్(10) ఉన్నారు.

తనిఖీలు షురూ


స్వాధీనం చేసుకున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులు

మంచిర్యాల క్రైం: ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. జిల్లా కేంద్రంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించే సునీల్‌శర్మకు చెందిన ట్రేడర్స్‌లో స్థానిక సీఐ భన్సీలాల్ సిబ్బందితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు కలిగిన రూ.2లక్షల విలువైన పది బ్యాగులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి స్థానిక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసుకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుట్కా, అంబార్, ఇతర డ్రగ్స్, మత్తు పదార్థాలను నిషేధించిందని తెలిపారు. అక్రమంగా అమ్మకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అగ్ని‘గండమే’..!

- ప్రైవేటు ఆస్పత్రులు, వాణిజ్య భవనాల్లో భద్రత కరువు
- పలు దుకాణాల్లో అగ్ని ప్రమాదాలు
- పేరుకే ఫైర్‌సేఫ్టీ పరికరాలు
- అనుమతి లేకుండానే నిర్మాణాలు


మంచిర్యాల మార్కెట్ రోడ్డులో షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన చెప్పల దుకాణం(ఫైల్)


బెల్లంపల్లి చౌరస్తాలో ఒకదానిని ఒకటి ఆనుకుని నిర్మించిన భవనాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంగా మారడంతో పెద్దపెద్ద షాపింగ్ కాంప్లెక్సులు ఏర్పాటవుతున్నాయి. కార్పొరేట్‌స్థాయిలో వైద్యం పేరిట పలు ప్రైవేటు ఆస్పత్రులు వెలుస్తున్నాయి. పారిశ్రామిక, సింగరేణి ప్రాంతం కావడంతో ఈ ప్రాంత ప్రజలను ఆకర్షించేలా వ్యాపార, వాణిజ్య కేంద్రాలను తళతళ మెరిసేలా ఫ్లోర్‌లతో చూడముచ్చటగా షాపింగ్ కాంప్లెక్సులు నిర్మిస్తున్నారు. పైకి చూడ్డానికి అన్ని హంగులతో ఉండే దుకాణాల్లో భద్రత చర్యలు పాటించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. దుకాణ సముదాయాల్లో చిన్నపాటి అగ్ని ప్రమాదం జరిగినా భద్రత పొందే వెసులుబాటు ఏర్పాటు చేసుకోవడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం ఫైర్‌సేఫ్టీ కోసం ప్రతీఫ్లోర్‌లో వాటర్ స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకుంటున్నా వాటి పనితీరు పరిశీలించడంలేదు. భవన నిర్మాణంకోసం మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకుంటున్నా అగ్నిమాపక శాఖ ద్వారా ఎన్‌వోసీ లేదా అనుమతులు తీసుకోవడం లేదు. దీంతో అగ్ని ప్రమాదాలు జరిగితే మాత్రం పెద్ద ఎత్తున ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. జిల్లా కేంద్రంలో ఇటీవల రెండు దుకాణాల్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగింది. రెండు ఘటనలు రాత్రివేళల్లో జరగడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకున్నా సామగ్రి పూర్తిగా కాలిపోయి ఆర్థికంగా నష్టం వాటిల్లింది.

మంచిర్యాలకే రాకపోకలు..

మంచిర్యాల జిల్లాగా మారకముందు నుంచే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తూర్పు జిల్లా కేంద్రంగా పేరుగాంచింది. దక్షిణాది మధ్య రైల్వేలైను ఈ ప్రాంతం నుంచే వెళ్తుండడంతో ఇక్కడి మార్కెట్ ఇతర రాష్ట్రాలతో ముడిపడి ఉంది. జిల్లాతో పాటు కుమురంభీం ఆసిఫాబాద్, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల ప్రజలు వ్యాపారానికైనా, వైద్యానికైనా మంచిర్యాలకే వస్తుంటారు. దీంతో హైదరాబాద్ వంటి నగరాల్లో వెలుస్తున్న కార్పొరేట్ బట్టల దుకాణాలు, బంగారం దుకాణాలు మంచిర్యాలలో బ్రాంచీలు తెరుస్తున్నాయంటే ఇక్కడ వ్యాపారం ఏవిధంగా సాగుతుందో తెలుస్తుంది. ఒక భవనాన్ని ఆనుకుని మరో భవనం ఉండడం, ఇళ్లకు సమీపంలోనే ఈ భవనాలను నిర్మించడం వల్ల అగ్ని ప్రమాదం జరిగితే ఫైరింజన్ వచ్చేందుకు కూడా స్థలం లేదు. ఇందులో ఏ ఒక్కటి కూడా అగ్నిమాపక శాఖ అనుమతిని తీసుకోకుండానే నిర్వహిస్తుండడం గమనార్హం.

నిబంధనల అమలుపై నిర్లిప్తత...

- అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం ఆస్పత్రులు, ఇతర వ్యాపార సముదాయాలు అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పేందుకు అవసరమైన పూర్తి సన్నద్ధతను కలిగి ఉండాలి.
- షాపింగ్ కాంప్లెక్సులు, ఆస్పత్రుల నిర్వాహకులు తమ భవనాల చుట్టూ ఫైరింజన్ తిరిగేలా రోడ్డు వెసులుబాటు కలిగి ఉండాలి.
- 15 మీటర్ల కంటే ఎత్తు దాటిన భవనాలకు నిర్మాణ సమయంలోనే పైఅంతస్తులో(టెర్రస్) వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయాలి. వాటి నుంచి ప్రతీఫ్లోర్‌కు పైపులు(ఆటోమేటిక్ స్ప్రింక్లర్లు) అమర్చి మంటలు చెలరేగిన సమయంలో వాటిని ఓపెన్ చేసి ఆ నీటితోనే ఆర్పే ఫైర్ సేఫ్టీ టెక్నాలజీని కలిగి ఉండాలి.
- అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉండే పరిశ్రమలు, ఇతర వ్యాపార సముదాయాలు పట్టణ శివారులోనే ఏర్పాటు చేసేందుకు అనుమతించాలి.
- మంటలు ఆర్పే అగ్నిమాపక యంత్రాలు ప్రతీ అంతస్తులోనూ తప్పకుండా ఉంచాలి. వాటి వినియోగంపై సిబ్బందికి అవగాహన ఉండాలి.
- ప్రతీ అంతస్తులో అగ్ని ప్రమాదం జరిగేందుకు ఆస్కారం ఉన్నట్లు పొగను గుర్తించే ఆటోమేటిక్ స్మోక్ అలారం ఏర్పాటు చేయాలి.

నిబంధనలు పాటించాలి



మంచిర్యాలలోని చాలా భవనాలు, ప్రైవేటు ఆస్పత్రులు అగ్నిమాపక శాఖ నిబంధనల మేరకు నిర్వహించడం లేదు. 15 మీటర్ల కంటే ఎత్తున్న భవనానికి అగ్నిమాపక శాఖ అనుమతి తప్పనిసరి. మంచిర్యాలలోని ఏ ఒక్క ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులు అగ్నిమాపక శాఖ ద్వారా అనుమతి తీసుకోలేదు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటిస్తే ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే దానిని ఆపేందుకు అవకాశం ఉంటుంది.

– అజయ్‌బాబు, ఫైర్‌సేఫ్టీ ఆఫీసర్, మంచిర్యాల

జాజులపేట విద్యుత్ సమస్య పరిష్కారం


అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డీఈ, ఏడీ

సాక్షి ఎఫెక్ట్..

వేమనపల్లి: మండలంలోని జాజులపేట గ్రామానికి ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు వెళ్లి బుధవారం విద్యుత్ సమస్య పరిష్కరించారు. గత 15 రోజులుగా తరచూ విద్యుత్ అంతరాయంతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు, సిబ్బంది మధ్య మంగళవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయమై ‘కరెంట్ ఇయ్యం.. దిక్కున్న చోట చెప్పుకోండి’ శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. ట్రాన్స్‌కో సీఎండీ ఈ కథనంపై తీవ్రంగా స్పందించి జిల్లా ట్రాన్స్‌కో అధికారులను అప్రమత్తం చేశారు. ఆయన ఆదేశాలతో బెల్లంపల్లి డీఈ రాజన్న, ఏడీ రాంచందర్, ఏఈ దీక్షిత్‌లు హుటాహుటిన గ్రామానికి వెళ్లారు. ఎస్సీ కాలనీ సమీపంలో చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరొకటి అమర్చారు. ట్రాన్స్‌కో డీఈ రాజన్న మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని, ఎలాంటి అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ మీటర్లు అమర్చుకోవాలని, విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని తెలిపారు. ఏఈ దీక్షిత్, జేఎల్‌ఎం ఉదయ్‌కుమార్ ఉన్నారు.

పేదల ఆకలి తీర్చిన ఏబీఏపీ


తిరుమల్‌రావును సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాలఅర్బన్: అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) ఆధ్వర్యంలో పెరుగన్నంతో పేదల ఆకలి తీర్చిందని ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు అన్నారు. బుధవారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో 40 రోజులుగా నిర్వహిస్తున్న పెరుగన్నం ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహాయంతో రోజుకు 500 మందికి పెరుగన్నం పంపిణీ చేసినట్లు తెలిపారు. పెరుగన్నం దాతలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజ్‌కిరణ్, అర్చకుడు నరహరిశర్మ, ఏబీఏపీ గౌరవ అధ్యక్షుడు నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి సంతోష్, సహాయ కార్యదర్శులు సిరిపురం రాజేశం, సత్యనారాయణ పాల్గొన్నారు.

సింగరేణికి బకాయిలు చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య


మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.29 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎస్‌ఆర్పీ 3 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాం నుంచి బకాయిలు రావాల్సి ఉందని, కొత్త ప్రభుత్వంలోనైనా చెల్లిస్తారనుకుంటే పట్టించుకోవడం లేదని అన్నారు. సింగరేణిలో కొత్త గనులు తవ్వడానికి నిధులు లేవని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం సంస్థ సాధించిన లాభాల నుంచి 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలన్నారు. జూన్‌లోనే విద్యార్థుల ఫీజులు, పుస్తకాలు కొనడం వంటి ఖర్చులు కార్మికులకు ఉంటాయని, ఈ మొత్తాన్ని జూన్‌లోనే చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమరయ్య, ఫిట్ కార్యదర్శి మురళి చౌదరి, మైనింగ్ స్టాఫ్ నాయకులు మారుపెల్లి బాపు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు మోతే లచ్చన్న, రామచందర్, మల్లికార్జున్, నాగేశ్వరరావు, అంబాల రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రాంగణంలో ఫంక్షన్ హాల్

- అద్దెకు ఇవ్వాలనే యోచనలో అధికారులు
- బస్టాండ్‌కు రాని ప్రయాణికులు


బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలంలోని ఓ భాగం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని ఖాళీ స్థలం వాణిజ్య రూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. బస్టాండ్‌కు కొంతకాలంగా ప్రయాణికుల ఆదరణ లేక వెలవెలబోతోంది. ఈ కారణంగా బస్టాండ్‌ను ఎత్తివేయలేని పరిస్థితులు ఉండగా.. ఖాళీ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకు ఇవ్వాలనే యోచనలో ఆర్టీసీ అధికారులు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఔత్సాహిక వ్యాపార వర్గాలకు కేటాయిస్తే ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. బస్టాండ్‌కు పది ఎకరాల భూమి ఉండగా.. ఇందులో మూడెకరాలు వినియోగంలో, ఏడెకరాలు పడావుగా ఉంటోంది. కొంత ఖాళీ స్థలాన్ని అద్దెకు ఇవ్వడం సముచితమని ఆర్టీసీ యాజమాన్యానికి నివేదిక పంపించడానికి ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్ డిపో అధికారులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రతిపాదనలు కార్యరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయి.

నిరాదరణకు గురై..

ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రయాణికులు స్వల్పంగా వస్తుండగా.. మెజార్టీ ప్రయాణికులు పాతబస్టాండ్, కాంటా చౌరస్తా, ఏఎంసీ, సింగరేణి ఏరియా ఆస్పత్రి, కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపైన ఏర్పాటు చేసిన బస్టాప్‌ల వద్ద బస్సెక్కి గమ్యస్థానం చేరుకుంటున్నారు. ఇక రాత్రివేళ బస్టాండ్ ఆవరణలో తప్పా చుట్టుపక్కల వీధి దీపాలు లేక, ఉన్నవి వెలుగక చిమ్మచీకటి ఆవరించి ఉంటోంది. దీంతో ప్రయాణికులు రాత్రి పూట అటువైపే రావడం లేదు. నైట్ హాల్టింగ్ బస్సు డ్రైవర్, కండక్టర్లు మాత్రమే బస్టాండ్‌లో ఉంటున్నారు. ప్రయాణికుల సందడి కానరాక బస్టాండ్ నిరాదరణకు గురవుతోంది.

స్టాల్స్ అద్దెకు విముఖత

బస్టాండ్‌లో స్టాల్స్ ఏర్పాటుకు గదులు ఉన్నాయి. ఏటా ఆ గదుల అద్దె కోసం ఆర్టీసీ అధికారులు టెండర్లు పిలిచినా సానుకూల స్పందన రావడం లేదు. మూడు గదులు ఖాళీగా ఉన్నా అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రస్తుతం బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ కార్గో సేవలు తప్పా మరేలాంటి సేవలు, సౌకర్యాలు అందుబాటులో లేవు.

బస్‌డిపో మంజూరు కాక..

ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్‌డిపో పరిధిలోని బెల్లంపల్లి బస్టాండ్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. బొగ్గుగనుల క్షేత్రమైన బెల్లంపల్లిలో కన్నాల బస్తీ శివారులో ప్రధాన రహదారిని ఆనుకుని 1991లో ఆర్టీసీ యాజమాన్యం బస్టాండ్ నిర్మించింది. మంచిర్యాల–ఆసిఫాబాద్ బస్ డిపోల మధ్యన ఉన్న ఈ బస్టాండ్ మీదుగా రోజువారీగా పదుల సంఖ్యలో బస్సులు సుదూర ప్రాంతాలకు రాకపోకలు చేస్తున్నాయి. ఆర్టీసీ బస్ డిపో మంజూరు అంశం ఎన్నికల హామీగా మారిందే గానీ ఆచరణలో సాధ్యం కావడం లేదు.

ప్రతిపాదనలు పంపిస్తాం

బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో కొంతకాలం నుంచి ప్రయాణికులు కానరావడం లేదు. బజారు ఏరియా మీదుగా బస్ సర్వీసులను నడిపిస్తుండడంతో చాలామట్టుకు ప్రయాణికులు బస్టాప్‌ల వద్ద బస్సెక్కుతున్నారు. ఖాళీ స్థలంలో కొంత భాగాన్ని ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకు ఇవ్వాలని సమాలోచనలు చేస్తున్నాం. ఆర్టీసీకి ఆదాయం వస్తుంది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రతిపాదనలు పంపిస్తాం.

– బి.విశ్వనాథ్, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆసిఫాబాద్

వరుస చోరీల దొంగ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాసులు, డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు

- రూ.10.97లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ శ్రీనివాసులు

జైపూర్: వేమనపల్లి మండలం నీల్వాయి పోలీసుస్టేషన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. రూ.10.97లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగుండం సీపీ శ్రీనివాసులు మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 26, 27వ తేదీల్లో అర్ధరాత్రి కల్మలపేట గ్రామానికి చెందిన సల్పల శ్రీనివాస్ అలియాస్ లింగయ్య తాళం వేసి ఉన్న ఇళ్లలో బంగారం, వెండి, నగదు చోరీకి పాల్పడ్డాడు. కేతనపల్లి గ్రామానికి చెందిన నెందుగరి రామన్న ఫిర్యాదు మేరకు నీల్వాయి ఎస్సై శ్యామ్‌పటేల్, చెన్నూర్‌రూరల్ సీఐ సుధాకర్ చెన్నూర్ రూరల్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. మంగళవారం మల్లంపేట గ్రామం వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన సల్పల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. బ్యాగు తనిఖీ చేయగా బంగారం, వెండి ఆభరణాలతోపాటు రూ.2,62,600 నగదు లభించాయని, మొత్తం విలువ రూ.10,97,600 ఉంటుందని సీపీ వివరించారు. సీఐ సుధాకర్, ఎస్సై శ్యామ్‌పటేల్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

పల్లెల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీనివాసులు హెచ్చరించారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


మృతుడు సురేశ్ (ఫైల్)

జైపూర్: మండలంలోని కాన్కూర్ గ్రామానికి చెందిన నెందుగూరి సురేశ్(32) మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జైపూర్ అదనపు ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాన్కూర్ గ్రామానికి చెందిన నెందుగూరి లక్ష్మి, బాపు దంపతుల చిన్న కుమారుడు సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగుతూ ఉండేవాడు. ఈ నెల 27న వ్యవసాయ పొలం వద్ద పడుకోవడానికి వెళ్లి ఉదయం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం చనిపోయా డు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ విడిచి పెడితే రూ.20 వేలు!

- పట్టుకుని వదిలిపెట్టిన అధికారులు
- సంబంధం లేదంటూ బుకాయింపు


వివరాలు వెల్లడిస్తున్న గ్రామానికి చెందిన యువకులు

వేమనపల్లి: మండలంలోని కల్లెంపల్లి గ్రామ సమీపంలో అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీ అధికారులు పట్టుకున్న ఘటన వివాదాస్పదంగా మారింది. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి చిరంజీవికి చెందిన ట్రాక్టర్‌లో అర్ధరాత్రి ప్రాణహిత నది నుంచి ఇసుక తరలించారు. గ్రామంలోని మరో వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎఫ్ఎస్ఓ బేగ్, ఎఫ్‌బీఓ పోచన్న, బేస్‌క్యాంపు సిబ్బంది వెంకటి తదితరులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. కేసు కాకుండా ఉండాలంటే రూ.20 వేలు చెల్లించాలని అటవీ సిబ్బంది డిమాండ్ చేసినట్లు ట్రాక్టర్ యజమాని చిరంజీవి ఆరోపించాడు. వేమనపల్లికి చెందిన తన బంధువు కీర్తి రవి వద్ద ఫోన్ పే ద్వారా డబ్బులు బదులు తీసుకుని అటవీ సిబ్బంది సూచించిన గురిజాల అంజన్నకు 1.14 గంటలకు ఫోన్ పే ద్వారా రూ.20 వేలు పంపించానని పేర్కొన్నాడు. ఎఫ్ఎస్ఓ బేగ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. ఎఫ్‌బీఓ పోచయ్య మాట్లాడుతూ అక్కడికి వెళ్లింది నిజమేనని, అటవీ భూమిని ఆనుకొని ఉన్న ప్రాణహిత నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. రూ.20 వేలు తాము అడగలేదని, అతను ఎవరికి ఫోన్ పే ద్వారా చెల్లించారో తెలియదని సమాధానం ఇచ్చారు.

నైపుణ్య శిక్షణ తరగతులకు పేరు నమోదు

బెల్లంపల్లి: కుమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని రైతులకు నిర్వహించనున్న నైపుణ్య శిక్షణ తరగతులకు ఔత్సాహిక రైతులు పేరు నమోదు చేసుకోవాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, వర్మీ కంపోస్టు తయారీ విధానం, పెరటి కూరగాయల సాగులో పాటించాల్సిన మెలకువలపై జూన్–జులై మాసాల్లో 3 రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు జూన్ 6లోపు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. బ్యాచ్‌కు 25–30 మంది చొప్పున రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్టీపీపీ కార్మిక సమస్యలపై చర్చలు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ) కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై బుధవారం హైదరాబాద్‌లో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ నేతృత్వంలో చర్చలు జరిపారు. హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో పలుమార్లు సమస్యల పరిష్కారానికి సమ్మె నోటీసులు అందించగా ఇప్పటికే పలు దఫాలుగా ఎస్టీపీపీ అధికారులు, కార్మిక సంఘం నాయకులతో సమస్యలపై చర్చించారు. ఎస్టీపీపీలో అమలు చేస్తున్న వేతనాలు, అలవెన్సులు, హైపవర్ కమిటీ వేతనాలు అందించాలని కోరారు. దీనిపై ఉన్నతస్థాయి అధికారులతో చర్చిస్తామని సింగరేణి అధికారులు వెల్లడించారు. అనంతరం సింగరేణి భవన్‌కు వెళ్లి సీఎండీ కోఆర్డినేటర్ జీఎం నరేందర్‌కు సమస్యలు విన్నవించినట్లు హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు.